# సావిత్రి

సావిత్రి చేతికందిన నాలుగు చీరలు సూటుకేసులో సర్దుకుంది. కొడుకు మొహం కడిగి తల దువ్వింది. తనూ తల దువ్వుకుని బట్టలు మార్చుకొంది. తనను నేను నిశ్శబ్దంగా గమనిస్తూనే ఉన్నాను. తన కళ్ళనుండి అవిరామంగా కారుతున్న కన్నీళ్లు చూస్తున్నాను. ఒకోసారి కళ్లు తుడుచుకుంటోంది. మరోసారి కన్నీళ్లు కారుతున్నాయనే ధ్యాసే లేనట్టుంది.

"మరి వస్తాను" అందిచివరికి. తనను దగ్గరకు తీసుకున్నాను. లతలా అల్లుకుపోయింది.

"ఊరుకో సావిత్రీ. నువ్వే ఇలాగుంటే విజయకేం ధైర్యం చెబుతావ్? పద. నిన్ను బస్టాండు దగ్గర దింపి వస్తాను."

"వద్దండి. క్లినిక్ తెరిచే వేళయింది. మీరు వెళ్లండి. నా కేసులు రొటీన్‌వి మాత్రం మీరు చూడండి. మరీ అర్జంటు కేసులు డాక్టర్ లతకు పంపించండి. తనతో ఇదివరకే మాట్లాడాను."

"విజయకు ధైర్యం చెప్పు. వీలయితే వెంట బెట్టుకురా. కాస్త స్థలం మార్పు ఉంటుంది." సరేనన్నట్టు తల ఊపి బాబు చేయి పట్టుకొని బయటికి నడిచింది. నారాయణ సూటుకేసు టాక్సీలో పెడ్తున్నాడు. టాక్సీ కదలగానే కళ్యాణ్ చెయ్యి ఊపాడు ఉత్సాహంగా. సాయంకాలపుటెండలో వాడి బుగ్గలు మెరుస్తున్నాయి. వాడిని వదిలి ఒక్కరోజు కూడా నేనుండలేను. వాడు ఇప్పుడు వెళ్లటం కూడా నాకిష్టంలేదు. కాని మూడేండ్ల వాడు తల్లి లేకుండా ఉండగలడా? భారంగా అడుగులు వేస్తూ లోనికి కదిలాను.

క్లినిక్‌లో యాంత్రికంగా పేషెంట్లను చూశానే గాని నా ఆలోచనలన్నీ విజయ చుట్టూ ఉన్నాయి. ఆ రాత్రి భోజన మయిందనిపించి త్వరగా పడుకున్నాను. సైడ్ టేబుల్ నుండి పుస్తకంతీశాను ఏదైనా చదువుదామని. అప్పుడే జారి పడింది టెలిగ్రాం. ప్రొద్దున వచ్చిన టెలిగ్రామ్. ఆ రోజంతా ఇంట్లో చిరునవ్వుని ఉఫ్ అని ఊదేసిన టెలిగ్రామ్. యాంత్రికంగా విప్పాను. అదివరకు పదిసార్లు చదివిందే అయినా మరలా చదివాను "రాజా డైడ్ లాస్ట్ నైట్." ఇంకేం వివరాలు లేవు.

విజయా, సావిత్రి చిన్నప్పటినుంచి స్నేహితులు. ఇంటర్మీడియట్ దాకా కలిసి చదువుకొన్నారు. తరువాత విజయ బిఎస్‌సి చేసింది. సావిత్రి మెడిసన్, తను ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసింది. అప్పుడే మా పరిచయం. తర్వాత పెళ్లి. ఇద్దరం కలిసి మా ఊళ్లోనే ప్రాక్టీసు పెట్టుకున్నాం.

విజయ భర్త గుంటూరులో ఏదో బిజినెస్ చేస్తున్నాడు. మా రెండు కుటుంబాలకు బాగా రాకపోకలున్నాయి. స్నేహితురాళ్ల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతూ ఉంటాయి.

విజయకు పుట్టటమయితే ఇద్దరు పిల్లలు పుట్టారు గానీ వాళ్లు నెలల బిడ్డలుగా ఉన్నప్పుడే పోయారు. మేము ఢిల్లీలో ఉండగా, వాళ్ల రెండో పాప, నాలుగు నెలల పాప పోయిందని ఉత్తరం వచ్చింది. ఆ రోజు సావిత్రి చాలా దుఃఖ పడింది. వేణు వ్రాసిన ఉత్తరం చూపించింది. అదిప్పటికీ నాకు బాగా జ్ఞాపకం.

"డియర్ సావిత్రీ,

గడిచిన నాలుగేళ్లలో నేనిస్తున్న రెండో దుర్వార్త. ఈ పాటికే నీకు అర్థమయి ఉంటుంది. అవును పాప పోయింది. ఈసారి జాండిస్. ఏదో ఒక మిషతో మాకు సంతానం దక్కకుండా పోతోంది. తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ తీసుకుంటున్నా మా దురదృష్టం మమ్మల్ని వెంటాడుతోంది.

ఈసారి విజయ గురించే మరీ బాధ. తను ఏడ్చినా, అన్నం ముట్టకుండా దుఃఖపడినా, ఏ విధంగానైనా తన బాధను వ్యక్తం చేసినా బాగుండేది. పాప చనిపోయిన క్షణం నుండి తను దేవుడి గది వదిలి రావడంలేదు. ఎవరితోనూ మాట్లాడటంలేదు. చివరి సారిగా పాపను చూట్టానికీ రాలేదు. దేవుణ్నీ ఏ ప్రశ్నలడుగుతోందో, ఏ తర్కవితర్కాలు జరుపుతోందోగాని మన లోకంలో లేదు. ఇలా అయితే తను నాకు దక్కదు.

ఒక్కసారి నువు రాగలవా?"

ఆ రోజే విజయ గురించి వివరాలన్నీ చెప్పింది సావిత్రి. "వాళ్లు మొదటినుంచీ జాగ్రత్త తీసుకోవలసింది..."

నా మాట పూర్తికాకుండానే సావిత్రి అడ్డుకుంది. "గోపీ ఇప్పుడు థియరీలు మాట్లాడకు. వాళ్లకు రెండుసార్లు ఇలా కావడం సరైన జాగ్రత్తలు తీసుకోకేనంటావా? మరి మనం వి.ఐ.పి.లకు, ఎంతో నిష్ఠగా వైద్యం చేస్తామే. ప్రత్యేకమైన మందులు, వైద్య సదుపాయాలూ కల్పిస్తామే అయినా ఆ కేసులెందుకు బెడిసి పోతాయి? మనకు చాకచక్యం లేకా, లేక మందుల శక్తి చాలకా? దేరీజ్‌సమ్ థింగ్ బియాండ్ అజ్. డోంట్ యూ సీ?"

అప్పుడు వారం రోజులు సెలవు పెట్టి విజయను చూసి వచ్చింది సావిత్రి. తనను చూడగానే మంచుబొమ్మలా వున్న విజయ కరిగి కన్నీరయిందట.

ఆ మరుసటి సంవత్సరమే విజయకు కొడుకు పుట్టాడు. రాజా మొదటి పుట్టిన రోజుకు నేనూ సావిత్రీ వెళ్లాం. అప్పుడప్పుడే మా పెళ్లయింది.

"నాకు వీడిని చూసి సంతోషించాలన్నా, నా అదృష్టానికి మురిసిపోవాలన్నా భయమే" అంది విజయ.

మేమేం మాట్లాడలేకపోయాం.

"దురదృష్ట దేవత ఎక్కడో పొంచి వుందేమో నేను ఏ కాస్త సంతోషించినా వీడిని లాక్కుపోతుందేమోనని ఒక్కోసారి రాత్రుళ్లు నిద్ర కూడా పట్టదు" అంది రాజాను హత్తుకుంటూ.

"అదేం మాట. వెర్రి భయాలూ, నువ్వూను" అని మందలించింది సావిత్రి. కాదన్నట్టు తల ఊపింది విజయ.

"నాకు అన్నీ తెలుసు. సుఖదుఃఖాలు మానవజన్మ ఎత్తిన తర్వాత తప్పవు. బ్రతుకే శాశ్వతం కానప్పుడు ఈ కష్ట సుఖాలూ కలకాలం ఉండవని తెలుసు. కానీ మనం జీవిస్తున్న క్షణం నిజమైనది. అప్పుడు కలిగే బాధా నిజమైనదే. నేను ఇది వరకే దెబ్బతిన్న దానిని. అందుకే ఆ ఆలోచనకే తల్లడిల్లిపోతున్నాను".

"ఇదిగో ఇలాంటి మాటలే మాట్లాడవద్దనేది. దుఃఖాన్ని మరచిపోవటానికి ప్రయత్నించాలి. అదే హెల్తీ యాటిట్యూడ్. గాయాన్ని కెలికి కెలికి ఆ బాధలోనే తృప్తి పొందడమనేది మానసికరుగ్మత. దానికి పెద్ద పెద్ద పేర్లు పెట్టుకోవలసిన అవసరం లేదు" అంది సావిత్రి.

"మీరిద్దరూ ఇలాగే వాదోపవాదాలు చేస్తుంటారా లేక హాయిగా ఎటైనా తిరిగి వచ్చేదుందా?" అన్నాను.

వారంరోజులు వాళ్లింట్లో సరదాగా గడిపాం. కనక దుర్గ గుడికి వెళ్ళాం. కృష్ణా నదీ తీరాన ఇసుక తిన్నెలపై సాయంకాలాలు గడిపాం. అమరావతికీ, మంగళగిరికీ వెళ్లాం.

మరో మూడేళ్లకు మాకు బాబు పుట్టాడు. అప్పుడు వాళ్లు రాజాను తీసుకుని వచ్చారు. "తమ్ముడు, తమ్ముడు" అంటూ ముద్దు పలుకులతో గెంతేవాడు రాజా. ఎప్పుడూ నవ్వుతూ ఉండేవాడు. వాడికి మాటలు స్పష్టంగా వచ్చేవి ఫొటో తీసుకోటమంటే తెగ మోజు. రక రకాల పోజులిచ్చేవాడు. "నువ్వు పెద్దయ్యాక మోడల్ కానీ హీరో గానీ అవుతావురా" అనేది సావిత్రి. వాడు వెళ్లి పోయిన తర్వాత ఇల్లంతా బోసిపోయినట్లయింది.

విజయ ఉత్తరాలు వ్రాస్తూవుండేది. ఎప్పుడూ కొడుకు గురించే వర్ణనలు. ఈసారి దీపావళికి ఎలాగైనా కళ్యాణ్‌ను తీసుకురావల్సిందని వ్రాసింది. ఇంతలో ఈ టెలిగ్రామ్.

సావిత్రి అవాక్కయింది. నేనూ తేరుకోలేకపోయాను. ఏ మాటలు చెప్పి వాళ్లను ఊరడించగలం. దెబ్బ మీద దెబ్బ కొట్టడానికి ప్రకృతికి సిగ్గులేక పోవచ్చు కాని వాళ్లను ఈ పరిస్థితిలో చూడటానికి మాకు మొహంచెల్లడంలేదు. చివరికి సావిత్రి ఒక్కతే వెళ్లింది. తను ఒక్కతే వెళ్లడం మంచిదనిపించింది. దుఃఖానికి కూడా ప్రైవసీ అవసరమవుతుంది. ఏకాంతంలో మండి మండి ఆత్మక్షాళన జరగవచ్చు.

వారం రోజుల తర్వాత సావిత్రి ఒక్కతే వచ్చింది. మొహం పీక్కుపోయింది "కళ్యాణ్ ఏడీ?" అన్నాను నా కళ్లను నమ్మలేనట్లు.

"విజయ దగ్గరే వదిలి వచ్చాను."

"అదేం పని?"

"అది మామూలు మనుషుల్లో పడటానికి మరో మార్గమే తోచలేదు" అంది సోఫాలో కూర్చుంటూ. తనకు తాగడానికి మంచినీళ్ళిచ్చాను. నీళ్ళు గటగటా తాగి తల వెనక్కు వాల్చి, కళ్లు మూసుకుంది.

"వాడిని తీసుకు రావడానికి నేనే వెళ్తాను" అన్నాను.

తను తల ఊపింది వద్దన్నట్టు.

"కళ్యాణ్ విజయ దగ్గరేవుంటాడు. వాడే దానికి థెరపీ."

"అంటే!"

"నేను రిసెర్చ్ చెయ్యాలి. కాబట్టి ఊరొదిలి వెళ్లాలి. కళ్యాణ్‌ను కొన్నాళ్లు నీ దగ్గరే పెట్టుకో. ఇక్కడ కాన్వెంటులో చేర్పించు" అని చెప్పాను. వాడు కూడా విజయ ఒడిలో చేరి కొంగుతో దోబూచులాడుతున్నాడు. కిలకిలా నవ్వుతున్నాడు. విజయ వాడిని హత్తుకొని భోరుమని ఏడ్చింది. నేను ఇంకేం మాట్లాడకుండా వచ్చేశాను."

"నీకేం మతిపోయిందా? మన ఒక్కగానొక్క బిడ్డ. వాడిని వదిలిపెట్టి రావడానికి మనసెలా ఒప్పింది?"

"మనసుకు నచ్చజెప్పుకున్నాను గోపీ. రాజా ఎలా పోయాడో తెలుసా? పార్కుకు ఆడుకోవడానికి వాళ్లమ్మతో పాటు వెళ్లాడు. తిరిగి వస్తున్నప్పుడు బెలూను కావాలని అడిగాడు. అన్నిటికంటే పెద్దగా ఉన్న బెలూను కొన్నాడు. తల్లీ కొడుకూ రోడ్డు దాటుతున్నారు. ఇంతలో వాడి చేతిలోని బెలూను ఎగిరిపోయింది. ఒక్క ఉదుటున వాడు బెలూను వెంట పరుగెత్తాడు. విజయ కళ్ళెదురుగానే కనురెప్ప మూసేంతలోపుగానే రక్తపు ముద్దగా మిగిలాడు. ఒక్క బెలూను... ఒక్క బెలూను కోసం... ఈ షాకు నుంచి ఏ మానవమాత్రులు తేరుకోగలరు చెప్పండి. ఇదివరకే దెబ్బలు తిన్న విజయ ఈ దెబ్బతో ఇక బ్రతకగలదేమో చెప్పండి" తనని తాను కంట్రోలు చేసుకుంటున్నట్లు ఆగింది సావిత్రి.

"దాని పుట్టెడు దుఃఖం ముందు... కళ్యాణ్‌తో దాని ఎదురుగా తిరగడం... చాలా గిల్టీగా ఫీలయ్యాను. దాని దుఃఖం మనం కొంచెం తీసుకుని మన సంతోషం కొంచెం పంచి ఇచ్చే మార్గమింకొకటి నాకు తోచలేదు."

సావిత్రి నెమ్మదిగా లేచి గదిలోకి వెళ్లింది. ఒక్క నిమిషమాగి నేనూ లోనికి నడిచాను. తను మంచంమీద అడ్డదిడ్డంగా పడుకొని ఉంది కళ్లకు చెయ్యి అడ్డం పెట్టుకొని. నెమ్మదిగా చెయ్యి తొలగించాను. కన్నీళ్లు కారుస్తోంది.తన తలను ఒడిలోకి చేర్చుకుని నిమరసాగాను. ప్రపంచంలోని దుఃఖంతో పోలిస్తే మన వ్యక్తిగత దుఃఖ మెంత? ఒకరి కన్నీళ్లు తుడవడానికి మనం కన్నీళ్లు కారిస్తే తప్పేమిటి?

(24 మార్చి 1991)